క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ బాబు

మఠంపల్లి : మండల కేంద్రంలో మేరీమాత ఉత్సవాలను పురస్కరించుకొని ఏసుమల్ల మేరమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను గురువారం ఎస్ఐ పి.బాబు ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదూరి కిషోర్‌రెడ్డి, ఏసుమల్ల రాములు, గాదె జయభారత్‌రెడ్డి, మహేష్‌గౌడ్, ముక్కంటి, శౌరి, ప్రసాద్, బాలరాజు, మత్తయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హెద్సారాణి, అధ్యాపకులు

కోదాడ : హైదరాబాద్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగిన తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్- 2025 పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్‌లో కోదాడ పట్టణంలోని కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు బాలికలు ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హెద్సారాణి గురువారం తెలిపారు. విద్యార్థులు కె.విజయ 52వ కేటగిరిలో 130 కేజీల విభాగంలో, ఏ.లక్ష్మీప్రసన్న 49వ కేటగిరిలో 120 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు చందా అప్పారావు, బి.సైదిరెడ్డి, సైదులు, రఫీ, రాజు, కె.సైదులు అభినందించారు.

కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మఠంపల్లి : మండలంలోని ఎన్‌సీఎల్ పరిశ్రమలో గల రామచంద్రరాజు స్మారక వైద్యశాలలో విజయవాడకు చెందిన వాసన్ ఐకేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 218 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 40 మందికి చుక్కల మందులు అందజేశారు. కొందరికి కంటిలో శుక్లాలు గుర్తించి శస్త్ర చికిత్స ఆవశ్యకతను వివరించారు. అదేవిధంగా పలువురికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు చక్రధర్, సతీష్‌కుమార్, దస్తగిరిరెడ్డి, శోభన్‌బాబు, పరిశ్రమ డాక్టర్ శ్రీహరిరావు, వైద్యసిబ్బంది గోపికృష్ణ, గణేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

కోదాడరూరల్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశారదను కోదాడ బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోదాడ కోర్టు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, రామిశెట్టి రాయకృష్ణ, ఉయ్యాల నర్సయ్య, వెంకటేశ్వరరావు, రమేష్ తదితరులు ఉన్నారు.

'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు పరిశీలిస్తున్న కార్యదర్శి

నేరేడుచర్ల : రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను గురువారం నేరేడుచర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. కాగా, మండలంలో 1353 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎస్టీ కార్పొరేషన్‌కు 93, ఎస్సీ కార్పొరేషన్‌కు 518, బీసీ కార్పొరేషన్‌కు 668, మైనార్టీ కార్పొరేషన్ 31 రాగా, క్రిస్టియన్ కార్పొరేషన్‌కు 4 దరఖాస్తులు వచ్చాయి.

మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

హుజూర్‌నగర్ : మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైన కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దుర్గారావు, కుమారి, సైదులు, వీరబాబు, వెంకన్న, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం.. 1.69 లక్షల మొక్కలు

- నర్సరీల్లో ముమ్మరంగా మొక్కల పెంపకం
- వేసవిలో మొక్కలు ఎండిపోకుండా షేడ్ నెట్‌ల ఏర్పాటు

కోదాడరూరల్ : రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో గ్రామాల్లో మొక్కలు నాటి సంరక్షిస్తోంది. ఈ ఏడాది జూన్, జూలై మాసాల్లో వర్షాలు కురవగానే చేపట్టబోయే వన మహోత్సవం విజయవంతం చేయాలనే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే కోదాడ మండలంలోని అన్ని గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి గత వర్షాకాలం ప్రారంభం నుంచి మొక్కలు పెంచుతున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేయగా వాటిల్లో మొత్తం 1.69 లక్షల మొక్కలు పెంచి జూన్, జూలైలో చేపట్టే వన మహోత్సవం కార్యక్రమంలో నాటడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఎండకాలంలో మొక్కలు ఎండిపోకుండా నర్సరీల్లో షేడ్ నెట్‌లు ఏర్పాటు చేశారు. ఎండలు మండిపోతున్నందున వన సేవకులను నియమించి ఉదయం, సాయంత్రం వేళలో మొక్కలకు నీటిని అందిస్తున్నారు. కాగా, నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు బ్యాగుల్లో మట్టి నింపిన కూలీలకు రూ.90 పైసలు, ఒక్కో విత్తనానికి రూ.30 పైసలు చెల్లించారు. మొక్కల సంరక్షణకు ఉపాధి హామీ పనుల్లో భాగంగా వన సేవకులను ఏర్పాటు చేశారు.



రెడ్లకుంట నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

నర్సరీల్లో మొక్కలు ఇవీ..

నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. నీడనిచ్చేవి, పండ్ల మొక్కలు, ఔషధ మొక్కలు పెంచుతున్నారు. వనమహోత్సవం ప్రారంభం కాగానే ఇంటి అవసరాలకు పెంచేవి పంపిణీ చేయడంతో పాటు వీధులు, చెరువుగట్లు, కాల్వ కట్టలు, రోడ్ల వెంట నాటనున్నారు. పండ్ల జాతికి చెందిన దానిమ్మ, సీతాఫలం, జామ, ఉసిరి, ఖర్జూర, బొప్పాయి, చీమచింత, నేరేడు, అలంకరణ మొక్కలైన మందార, గులాబీ, గన్నేరు, మల్లె వంటివి ఔషధ మొక్కలైన రణపాల, తులసి, వామాకుతో పాటు టేకు, వేప, రావి, మర్రి, దిరిషిన, గానుగ, చింత, ఈత వంటి పలు రకాల మొక్కలు నర్సరీల్లో పెరుగుతున్నాయి.

మొక్కలు ఎండిపోకుండా చర్యలు



ఈ ఏడాది వన మహోత్సవంలో నాటేందుకు పెట్టుకున్న లక్ష్యం దిశగా నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. ఎండకాలంలో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. మొక్కల సంరక్షణకు వనసేవకులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నీటిని అందిస్తున్నాం.

– వీవీ రాంచందర్‌రావు, ఎంపీడీఓ, కోదాడ

పెన్షనర్లు సామాజిక సేవ అలవర్చుకోవాలి



రాధా దుర్గ, శ్రీరామచంద్రమూర్తిలను సన్మానిస్తున్న హనుమరెడ్డి, తదితరులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వ పెన్షనర్లు సామాజిక సేవ చేయటం అలవర్చుకోవాలని రిటైర్డు డీఈఓ హనుమరెడ్డి సూచించారు. గురువారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో పెన్షనర్ల సామూహిక జన్మదినం, వివాహ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతినెల సామూహిక జన్మదిన వేడుకలు జరపటం మంచి సంప్రదాయమని అన్నారు. పెన్షనర్ల సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి పెన్షనర్లు తమవంతు సహాయం అందించాలని, అలాంటప్పుడే సంఘాలు మనుగడ సాగిస్తాయని తెలిపారు. అనంతరం వివాహ వార్షికోత్సవం జరుపుకుంటున్న పెన్షనర్లు రాధాదుర్గ శ్రీరామ చంద్రమూర్తిదంపతులను, ముద్ర లోన్ వినియోగించుకుని ప్రధానమంత్రి నుంచి ప్రశంసాపత్రం పొందిన కలువల సృజనను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పెన్షనర్ సంఘం అధ్యక్షుడు చెన్న సోమయ్య, నాయకులు అంకతి అప్పయ్య, దేవదానం, ఎస్.వెంకటేశ్వరరావు, కొప్పుల వీరారెడ్డి, ఎంఎస్ఎన్ రాజు, కేవీఎన్ మూర్తి, తాటి ప్రభాకర్‌రెడ్డి, మొయినుద్దీన్, కోటయ్య, లక్ష్మయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పని దినాల కుదింపు చట్ట వ్యతిరేకం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఉపాధి హామీ పథకంలో పని దినాల కుదింపు చట్ట వ్యతిరేకమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు అన్నారు. గురువారం చింతలపాలెంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పని దినాలు 8 కోట్ల నుంచి 6.5 కోట్ల పని దినాలకు తగ్గించడాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూలీలకు రూ.600 కూలి ఇవ్వాలని ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలని వారు కోరారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు వట్టేపు సైదులు, కె.సుందరమల్లేశ్వర్‌రెడ్డి, పి.హుస్సేన్, రామకృష్ణారెడ్డి, స్వరాజ్యం, సైదులు, భూలక్ష్మీ, పుల్లయ్య, జానిమియా, మక్బూల్, వెంకన్న, భాస్కర్‌రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేస్తాం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఇంద్రారెడ్డి, రైతులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ (ఎంబీసీ) లిఫ్ట్ బాధిత రైతులకు తప్పకుండా తగు న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎంబీసీ లిఫ్ట్ బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. లిఫ్ట్ పైప్‌లైన్ వల్ల వచ్చే సమస్యలను రైతులు కలెక్టర్‌కు వివరించారు. గతంలో శివగంగా లిఫ్ట్ పైప్ లైన్ వల్ల జరిగిన నష్టాన్ని వివరించి ప్రస్తుత పైప్ లైన్ పోయే భూమితో పాటు ముక్కలుగా మిగిలిన భూమిని కూడా తీసుకోవాలని కోరారు. భూమి నష్టపరిహారాన్ని మరింత పెంచాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ దష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ వారికి చెప్పారు. భూ సేకరణ చట్టం ప్రకారం భూమి నష్టపరిహారాన్ని మరింత పెంచే విధంగా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆర్డీఓతో మరోసారి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి బాధిత రైతులకు న్యాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఇరిగేషన్ సీఈ రమేష్ బాబు, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, చింతలపాలెం తహసీల్దార్ సురేందర్ రెడ్డి, ఎంబీసీ లిఫ్ట్ బాధిత రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన తమ్మిశెట్టి రామకృష్ణకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.35 వేల ఆర్థికసాయం చెక్కును గురువారం స్థానిక ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు అందజేశారు. పాలకూరి లాలు తదితరులు ఉన్నారు.

మేడే వేడుకలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న

హుజూర్‌నగర్ : మేడే వేడుకలను జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా భవన్‌లో నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య అధ్యక్షతన జరిగిన ఐఎన్‌టీయూసీ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 6న జిల్లాలో జరిగే ఆల్ ట్రేడ్ యూనియన్ల సదస్సును విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ అనుబంధ కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు తన్నీర్ మల్లికార్జున్, సాముల శివారెడ్డి, మేకల నాగేశ్వరరావు, అమర్‌నాథ్ రెడ్డి, ముక్కంటి, రామరాజు, గల్ల వేంకటేశ్వర్లు, బి.శ్రీనివాస్, జానయ్య, వీరబాబు, సావిత్రి, వెంకటమ్మ, గోపి, రాజు, వెంకటరెడ్డి, రవీందర్, రాము, ఉద్దండు, బాలకృష్ణ పాల్గొన్నారు.

మట్టపల్లిలో శ్రీలక్ష్మీనారసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం పూర్తిచేశారు. కల్యాణ తంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్యపాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ జరిపారు. అదేవిధంగా స్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రవేశం తరువాత మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

28న భూభారతి చట్టంపై అవగాహన సదస్సు



భూ భారతిపై చట్టం అవగాహన సదస్సుపై సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ ధృవకుమార్

చిలుకూరు : మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 28వ తేదీన భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ధృవకుమార్ తెలిపారు. గురువారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి చట్టం అవగాహన సదస్సు నిర్వహణపై సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరవనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, ఆర్ఐలు మంత్రిప్రగడ సీతారామచందర్ రావు, శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో బహుళ ఏకాదశి పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో గురువారం బహుళ ఏకాదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, అలంకరణ, సహస్రనామ ఫల పుష్పార్చన, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, మంగళాశాసనం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనతరం కొత్తా ప్రవీణ్‌కుమార్– అపర్ణ దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, కార్యనిర్వాహణాధికారి ఎంపి లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్ చార్యులు, కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేధింపులపై షీటీమ్‌కు ఫిర్యాదు చేయాలి



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సిబ్బంది

కోదాడరూరల్ : మహిళలపై వేధింపులకు పాల్పడితే షీ టీమ్‌కు ఫిర్యాదు చేయాలని షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ కవిత అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం కోదాడ పట్టణంలోని పీపీఆర్ మాల్‌లో షీటీమ్, సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన కల్పించి మాట్లాడారు. టీ సేఫ్ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని, మహిళలను, యువతులను ఎవరైన వేధిస్తే 87126 86056 ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పొద్దని, సోషల్ మీడియాలో ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దని, మొబైల్‌లో వచ్చే బ్లూ లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో షీ టీం కానిస్టేబల్ సాయిజ్యోతి, మాల్ సిబ్బంది ఉన్నారు.

పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అమానుషం



కోదాడరూరల్ : నిరసన ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ, ఐవీఓ ఆర్గనైజేషన్ సభ్యులు

కోదాడరూరల్ : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులు చేయడం అమానుషమని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రంగా థియేటర్ సెంటర్‌లో ఐవీఓ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి చేపట్టిన శాంతియుత నిరసన ర్యాలీలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఇలాంటి దాడులను దేశప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఖండించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు గుండా మధుసూదన్‌రావు, రమేష్, నాగేశ్వరరావు, ప్రసాద్, ఉపేందర్, వెంకన్న, రహీం తదితరులు ఉన్నారు.

ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో..

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ కోదాడ పట్టణ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ దాడిలో హిందు సోదరులతో పాటు ముస్లింలు కూడా మరణించారని, దీనికి మతాన్ని ముడిపెట్టడం సరికాదని దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్‌అలీ, మౌలానా హమీద్, ఖాజా, నజీర్, ఇస్మాయిల్, వాజిద్, అయ్యూబ్ ఉన్నారు.

మతోన్మాద ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి

కోదాడ : మతోన్మాద ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని, పౌరుల స్వేచ్ఛను, జీవించే హక్కును కాలరాసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రజాచైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి చిన్ని కోరారు. కాశ్మీర్ లోయలో ఉగ్రదాడికి గురై మరణించిన వారికి గురువారం కోదాడలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం ముందు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవత్వానికి మచ్చ తెచ్చే ఇలాంటి సంఘటనలను ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పందిరి నాగిరెడ్డి, హరికిషన్‌రావు, పంది తిరపతయ్య, సలీంషరీఫ్, బడుగుల సైదులు, జీఎల్ఎన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామనర్సయ్య, బాబు, ముత్తవరపు రామారావు, ఖాజామియా, నరసింహారావు, ఉదయగిరి, గోదేశి రామారావు, ఖజామియా తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిపై నిరసన ర్యాలీ

నేరేడుచర్ల : పర్యటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం వాసవి క్లబ్ డిస్టిక్ గవర్నర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నేరేడుచర్లలో నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పహల్గాంలో టూరిస్ట్‌లపై దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్టిక్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత, లక్ష్మీనర్సింహారావు, వాసవి, వనిత క్లబ్‌ల అధ్యక్షులు సుమన్, జ్యోతి, నాగేశ్వర్‌రావు, రమేష్, సత్యనారాయణ, నటరాజ్, కోటేశ్వర్‌రావు, గోపాలకృష్ణ, శ్రీనివాస్, వాసు, మోహన్, వెంకటేశ్వర్లు, అశోక్, రాము, అనిల్ తదితరులున్నారు.

దేశ రక్షణ అందరి బాధ్యత

గరిడేపల్లి : దేశాన్ని, ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు అన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మ శాంతించాలని గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాలిశెట్టి అంజయ్య, పోకల వెంకటేశ్వర్లు, చిత్తలూరి సోమయ్య, రామినేని కృష్ణయ్య, సుందరి రమేష్, యడవెల్లి సాగర్‌రెడ్డి, రాజు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



కోదాడ : నివాళులర్పిస్తున్న ప్రజా చైతన్య వేదిక సభ్యులు


ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



నడిగూడెంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సంజీవయ్య

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి సంజీవయ్య పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులను కల్పించడమే పంచాయతీరాజ్ వ్యవస్థ లక్ష్యమన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎలక ఉమారాణి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నేడు చర్చి ప్రారంభోత్సవం



దిర్శించర్లలో నూతనంగా నిర్మించిన చర్చి

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామంలో రూ.1.15 కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఉప్పల లేవి పంతులు మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చిని శుక్రవారం ప్రారంభించేందుకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కులమతాలకు అతీతతంగా సంఘస్తులు, దాతల సహకారంతో సేకరించిన విరాళాలతో ఈ చర్చిని అన్ని హంగులతో నిర్మించారు. చర్చి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా స్టివెన్సన్ బెంజిమన్ ఉప్పల, ఎం.ప్రభుదాస్‌లతో పాటు ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు, జబర్దస్ టీం సభ్యులు, పలు రాజకీయ పార్టీల నాయకులు హాజరవుతున్నారని సంఘం అధ్యక్షుడు రాపోలు నర్సయ్య, కార్యదర్శి పాతకోటి రమేష్, పాస్టర్ పల్లే శ్యాం డెవిడ్ తెలిపారు.

గాలిదుమారం వస్తే కరెంట్ బంద్ !



గాంధీనగర్‌తండా వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను కమ్మేసిన కంపచెట్లు

- ట్రాన్స్‌ఫార్మర్లను కమ్మేసిన కంపచెట్లు, అల్లుకుపోయిన చెట్ల తీగలు
- తరచూ ట్రిప్ అవుతూ విద్యుత్‌కు అంతరాయం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మేళ్లచెరువు : మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంపచెట్లు దట్టంగా పెరిగి వాటిని కమ్మేశాయి. చెట్ల తీగలు ట్రాన్స్‌ఫార్మర్లకు, విద్యుత్ లైన్లకు అల్లుకుపోయాయి. దీంతో గాలిదుమారం వచ్చినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు చెలరేగుతున్నాయి. తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అవుతూ విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. కాలం చెల్లిన విద్యుత్ తీగలు కావడంతో గాలిదుమారాలకు ఎప్పుడు తెగిపడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఏదైన సమస్య తలెత్తినప్పుడు విద్యుత్ సిబ్బంది తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని దీంతో సమస్య పునరావృతం అవుతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వెల్లటూరు పునరావస కేంద్రంలో గల ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు ఇటీవల ఒకదానికొకటి తాకి మంటలు వచ్చాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ దట్టంగా చెట్లు పెరగడంతో తరచూ విద్యుత్ సమస్య తలెత్తి కరెంట్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక కందిబండ సమీపంలోని పొలాల్లో గత మూడు సంవత్సరాలుగా తీగలు కిందికి వేలాడుతూ ఉన్నాయి. ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత 20 రోజుల క్రితం గేదె విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందింది. ఆ తర్వాత విద్యుత్ సిబ్బంది అక్కడ విద్యుత్ స్తంభం వేసి లైన్ ఎత్తు పెంచారు. ప్రమాదాలు జరగక ముందే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని వానాకాలంలో కరెంటు సమస్యలు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కందిబండ పరిధిలోని పెట్రోల్ బంకు సమీపంలో ట్రాన్స్‌పార్మర్‌కు అల్లుకుపోయిన చెట్ల తీగలు

డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం ప్రాణాంతకమని ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని వాణిజ్య భవన్ వద్ద గురువారం దినసరి కూలీలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ×నో డ్రగ్స్ సేవ్ లైఫ్×అనే నినాదంతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వాడకం వలన ఇటీవలి కాలంలో ఎంతో మంది అనారోగ్యానికి గురై చనిపోతున్నారని, యువత పెడదారిన పడకుండా వారిలో మార్పు రావడానికి తనవంతుగా కృషి చేస్తున్నానని తెలిపారు.